పంపించే ఉద్దేశంతో ఈ సర్క్యులర్‌ని రూపొందించడమైనదని గమనించ ప్రార్థన. పదిహేను రోజులలోగా ఏ సెక్షన్ నుంచి అయితే సమాధానం రాదో ఆ సెక్షన్‌లో అల్లకానికి పంపవలసిన కుర్చీలు లేవని భావించబడుతుంది. (నేను: జూన్ 4)

"ఎక్సలెంట్! గొప్పగా నడిపించేవు కథ! నీ బుర్రే బుర్ర! అని మేనేజరుగారు నన్ను మెచ్చుకున్నారు. "అన్ని సెక్షన్ల నుంచీ సమాధానాలు వచ్చేయా?" అని అడిగేరు.

"సర్క్యులర్ ఇష్యూ చేసిన పధ్నాలుగో రోజు సాయంకాలం నుంచీ కదా, జవాబులు వస్తాయి! అంతవరకూ ఇది అర్జంట్ అవదు సార్." అని చెప్పేను.

మేనేజరుగారు నా ఒక్క సీటు దగ్గిరా పది నిమిషాలు ఉండిపోవడం వల్ల నా పనీ ఆగిపోయింది; చోద్యం చూస్తున్న మా సెక్షన్ అంతా స్థంభించిపోయింది. అంతేకాక మేనేజరుగారి లాబీలో విజిటర్స్ సంఖ్య క్షణక్షణం పెరుగుతోంది. అంచేత ఆయన బయలు దేరేరు.

ఐతే, బయలుదేరిన మా మేనేజరుగారు ఓ క్షణంలో వెనక్కొచ్చి, ఒక ప్యూన్ని కేకేసి "ఈ కుర్చీ ఇక్కణ్ణించి తీసేసి స్టోర్‌లో పడెయ్యి. నా లాబీలో ఉన్న కుర్చీల్లో కాస్త మంచిది చూసి తెచ్చి ఇక్కడ వెయ్యి" అని ఆర్డర్ పాస్ చేసేరు.

ఆ తరవాత పదిహేను రోజులకి మొత్తం నలభై రెండు కుర్చీలు రిపేరుకి గాను అయిదు వందల నాలుగు రూపాయలు కూలి, మూడువందల ఇరవై రెండు రూపాయలకి ప్లాస్టిక్ త్రెడ్డు శాంక్షన్ అయ్యాయి.

ఏడ్చిన దాని మొగుడు ఒస్తే ఏడవని దాని మొగుడూ ఒచ్చేడన్నట్టుగా నా బాధ వల్ల ఎందరి బాధలో తీరి సాంఘిక ప్రయోజనంఏర్పడిందని నేను గర్వపడ్డాను. ★

# 94. స్వామి కార్యం

**"ను**వ్వు ఆఫీసుకి రాగానే ఓసారి వచ్చి తనకి కనిపించమన్నారు మన మేనేజరుగారు" అని అటెండెన్సు రిజిస్టరు నా ముందుకి తోశాడు మా సూపరింటెండెంటు.

రిజిస్టర్‌లో ఈ నెల పేజీలు పట్టుకుని అందులో నాపేరు ఉన్న పేజీ తెరిచి "ఏదైనా అర్జంటా?" అని అడిగాను.

"ఏమో నాకేం తెలుసు? ఆయన చెప్పమన్నారు; నేను చెప్పేను."

సంతకం పెడదామని నా పేరు ఎదురుగా ఉన్న లైన్‌లో ఈ రోజు గడిలో పెన్ మోపాను. అయితే అక్కడ ఎర్రసిరాతో ఒక కొశ్చన్ మార్కు పెట్టి ఉంది. రూల్ ప్రకారం అలా కొశ్చన్ మార్కు ఉంటే సంతకం పెట్టకూడదు. లేటుగా వచ్చాడా, సెలవుపెట్టాడా, అసలెక్కడ తగలడ్డాడు- ఇన్ని ప్రశ్నలు ఆ కొశ్చన్ మార్కులో ఉన్నాయి. సమాధానం మేనేజర్ గారికి చెప్పి మరీ సంతకం తగలెట్టాలి. ఆ సందర్భంలో చెప్పే కారణం వారికి సబబుగా తోచకపోతే రాత మూలకంగా పర్మిషన్ అడిగి, గ్రాంటు చేయించుకుని, వారి సమక్షంలో టైమ్ నోట్ చేసి సంతకం పెట్టాలి.

"రాగానే కనిపించమను" అని సూపరింటుగారికి చెప్పి కూడానూ, సూపరింటుగారి కార్యదక్షతను శంకించినట్లు మేనేజరుగారు నా మీద ఈ అస్త్రాన్ని ప్రయోగించారన్న మాట. అందుకని. "రాగానే" కాకపోయినా, వచ్చిన రెండో నిమిషంలో మేనేజరుగారి రూమ్‌లోకి వెళ్లాను.

"ఏమిటయ్యా, నువ్వూ నీ ఉద్యోగమూనూ?... కూర్చో... నువ్వసలు ఆఫీసుకి ఎన్ని గంటలకి రావాలి? ఇప్పుడు టైమెంతయింది? ఎంత సీనియర్‌వైతే కూడా పదకొండుం పావుకా, ఆఫీసుకి రావడం?"

"కె. అండ్ జె. కంపెనీ వాళ్ళు మనకి చెల్లించవలసిన బకాయి వసూలుకి ఈ రోజు ఉదయం తొమ్మిదిన్నరకి వాళ్ళ ఆఫీసుకి రమ్మని నిన్న ఫోన్‌లో చెప్పారండి. అందుకని రోజూ పదింటికి బయలుదేరేవాణ్ణే, ఇవాళ ఉదయం ఎనిమిదిన్నరకే ఇల్లు వదిలి వెళ్లానండి. వాళ్ళ ఆఫీసులో చెక్కు తయారయ్యే దాకా ఉండి ఇలా వచ్చేనండి. మధ్యలో ఎక్కడా ఆగలేదండి."

"ఉద్ధరించావులే గాని - ఏదీ ఆ రిజిస్టరు? - ఊఁ - సంతకం అఘోరించు... అయిందా? నువ్విప్పుడు అర్జంటుగా మా ఇంటికెళ్లు. మా అబ్బాయి ఉంటాడు. వాడికి మండల్ రెవెన్యూ ఆఫీసునుంచి నేటివిటీ సర్టిఫికెట్ కావాలి. అప్లికేషనూ మిగిలిన వివరాలూ తీసుకుని జీపులో మండలాఫీసుకి వెళ్లు. జీపు వెంటనే పంపించెయ్యి. నీ పని అవగానే ఫోన్ చేస్తే జీపు పంపిస్తాను. అప్పుడిక్కడికొస్తూ దార్లో ఈ సర్టిఫికెటు మా అబ్బాయికివ్వొచ్చు."

మండలాఫీసులో నా పని (అదే, మా మేనేజరుగారి పని) అయ్యేసరికి ఒంటిగంట దాటింది. ఫోన్ చేసేను. జీపు డ్రయివరు భోజనానికి వెళ్లేడన్నారు. అతనికిచ్చే ఇంతోటి జీతానికీ లంచి టైమ్ పదినిమిషాలకన్నా పడుతుందా అని మళ్ళీ పావుగంట ఆగి ఫోన్ చేసేను. నువ్వు ఎలాగో ఓలాగ ముందు మా ఇంటికెళ్లిపో. మా అబ్బాయి ఆ సర్టిఫికెటు కోసం ఇల్లు పట్టుకు కూర్చున్నాడు... జీపా? అదేమో! మా ఆవిడ కబురు చేస్తే ఇంటికే వెళ్ళినట్టుంది... నువ్వు జీపు కోసం చూస్తూ కూర్చోక."

సార్ గారింటికెళ్ళి సర్టిఫికెట్ అబ్బాయిగారికిచ్చి స్వామి కార్యం అయింది కదా అని స్వకార్యం నెరవేర్చుకుందామని మా ఇంటికి వెళ్ళి భోజనం చేసేసరికి రెండున్నర దాటింది. "చొక్కా విప్పుకొని కొంచెం రెస్టు తీసుకువెళ్లండి" అంది మా ఆవిడ. సరే కదా అని విప్పుకోబోతూ ఉంటే అందులో ఉదయం కె అండ్ జె కంపెనీ నుంచి తెచ్చిన చెక్కు కింద పడింది. "అయ్యబాబోయి, చెక్కు మూడు గంటల్లోపుగా ఎకౌంట్స్ సెక్షన్‌లో ఇవ్వకపోతే పీకలమీది కొస్తుంది!" అని ఆఫీసుకి బయలుదేరాను.

★ ★ ★

"ఇదుగో, పద్మనాభం! నువ్వు ఇవాళ నాతో చెప్పకుండా ఎక్కడికీ వెళ్లిపోకయ్యోయ్!" అన్న హెచ్చరిక విని వరండాలో నడుస్తూ వెనక్కి తిరిగాను. మా అసిస్టెంటు మేనేజరుగారు నా వెనకనే నడుస్తూ అప్పుడే ఆఫీసుకొస్తున్నారు. దాంతో నా నడక ఆపి, నమస్కారం చెప్పి ఆయన తన "ఛాంబర్స్"లోకి వెడుతూండగా నేనూ వెళ్ళాను మరి.

ఎ.యం. గారు తను కూర్చుంటూ నన్నూ కూర్చోమన్నారు. బెల్‌కొట్టి ప్యూన్ని పిలిచి అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించేరు. "సంతకం పెట్టు" అని ఆయనే పేజీ తెరిచి ఇచ్చేరు.

"నువ్వు అర్జంటుగా యూనివర్సిటీకి వెళ్లాలోయి. ఇవాళ బీకామ్ రిజల్ట్సు పేపర్ల వాళ్లకి విడుదల చేస్తారుట. నీకు తెలుసుగా, మా అమ్మాయి ఫైనలియరు పరీక్ష రాసింది!... ఇదుగో నెంబరు... ఆ ఎగ్జామ్స్ సెక్షన్‌లో నీకు తెలిసిన గుమస్తా ఎవరయినా ఉంటే సరే సరి; లేకపోతే పత్రికల వాళ్ళ నెవర్నయినా పట్టుకొని అయినా సరే, మా అమ్మాయి రిజల్టు తెలుసుకోవాలి. మార్కుల లిస్టు ఇవాల్టికి ఇవాళ విడుదల చెయ్యరనుకో. అన్ని పేపర్ల వివరాలూ కాపోయినా కనీసం మొత్తం ఎన్ని మార్కులొచ్చాయో కనుక్కోవాలి... ఫస్ట్ క్లాస్ గ్యారంటీగా వస్తుందనుకో. అయినా డిస్టింక్షన్ వస్తే ఆ దారి వేరు కదా! ఆ శుభవార్త కాస్తా నీ నోటిమీదుగా వినాలని నా కోరిక. నువ్వు అక్కణ్ణించి అలాగా మా ఇంటికి వెళ్లి మా అమ్మాయితో చెప్పేస్తే ఈ సాయంకాలం తన ఫ్రెండ్సు కొందరికి టీపార్టీ ఇస్తానంటోంది. ఖాళీ ఉంటే నువ్వు కూడా ఆరూ ఆరున్నరచేసి రావచ్చుననుకో-"

"సార్! ఒక్కమాట, సార్!" అన్నాను.

"నో" అన్నారాయన.

"అది కాదుసార్ - మరేం...."

"ఏదీ కాదు!... సరే. ఏంటో చెప్పు?"

"పి అండ్ ఆర్ కంపెనీ మనకి చెల్లించవలసిన బకాయి కోసం ఈ ఉదయం పదిన్నరకి వాళ్ళాఫీసుకి వెళ్ళమని నిన్న జి.ఎమ్.గారు స్వయంగా నాతో చెప్పేరు సార్..."

"ఓహో! అదా, నీ భయం? దానికేముంది? నీ బదులు నేను వెళ్తానక్కడికి. అన్నట్టు సంతకం నువ్వు పెట్టి రసీదివ్వాలి కదా? ఫరవాలేదు, రసీదు బుక్‌లో ఓ ఫాయిల్ సంతకం పెట్టి నాకిచ్చేయ్...పాప చాలా టెన్షన్ పడుతోందోయ్!... ఊఁ, త్వరగా బయల్దేరు మరి!"

★ ★ ★

"నిన్ను ఫైనాన్సు ఆఫీసరు గారు ఇంటర్ కమ్‌లో పిలుస్తున్నారు" అని మా సూపరింటు చెప్పారు.

"సార్, నేనండి. పద్మనాభం, బిల్స్ కలెక్టర్ - నమస్కారం సార్"

"అదే, అదే! నమస్కారం. నువ్వు ఇవాళ ఆఫీసు పనిమీద రామ్‌నగర్ వెడుతున్నావటగా? అక్కడ మా ఇల్లుంది, నీకు తెలుసుగా? ... తెలీదా? డోర్‌నెంబరు రాసుకో... అయిందా? ఇదుగో, మా స్టెనో ఆ ఇంటి తాళం తెచ్చి నీకిస్తాడు. అదే, ఇంట్లో అద్దెకుండేవాళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు, వారం అయింది. వాడిదుంపతెగ, ఆ ఎలెక్ట్రికల్ డిపార్టుమెంట్ తాలూకు మీటరు రీడర్ ఏదో రిపోర్టిచ్చాడట. అతన్ని తీసుకొని మనింటికెళ్లి మీటర్ రీడింగునోట్ చేయించాలయ్యా, నువ్వు ఈ పని జాగర్తగా చేస్తావని మీ మేనేజర్ చెప్పేరు... ఆలశ్యం అవుతుందంటావా? అయితే అయిందిలే. అంతగా మధ్యాహ్నం రెండో మూడో అయిపోతే నువ్వు అక్కణ్ణించి డయిరెక్టుగా ఇంటికి వెళిపో, ఆఫీసుకి రేపు రావచ్చు, మరేమీ కొంపలు మునిగిపోవు... అన్నట్టు నీ దగ్గర కలెక్షన్ ఉంటుంది కాబోలే? చెక్ అయితే పర్వాలేదుగానీ కేష్ అయితే రసీదు రేపటి తేదీ వేసి ఇవ్వడం మరిచిపోకు."

★ ★ ★

"బిల్స్ కలెక్టర్ పద్మనాభం అంటే నువ్వేనా? వెరీగుడ్. నీ గురించి మీ మేనేజర్ చాలాసార్లు చెప్పేడయ్యా, నీ అంతటి సమర్థులు చాలా అరుదంటాడాయన. సరే; నేను ఆయనతో మాట్లాడ తాను గాని, నువ్వు నా కారు తీసుకెళ్లి ఫోన్ బిల్లు కట్టేసి రావాలయ్యా... అదే, మా ఇంటి దగ్గరున్న ఫోన్ తాలూకు బిల్లు! అక్కణ్ణించి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గరేకదా. ఓసారి వెళ్ళి; మొన్న మేం కొన్నాం తెలుసుగా, ఇంటి స్థలం? - దాని తాలూకు డాక్యుమెంట్లు ఎప్పుడిస్తారో కనుక్కొచ్చీయాలోయ్. మా కారు డ్రయివరు దగ్గిర కాగితాలన్నీ ఉన్నాయి. వెళ్ళి అన్నీ సక్రమంగా చేసుకు రా, పో!"

★ ★ ★

ఆ నెలాఖరున జరిగిన మీటింగులో నా వసూళ్లు నూటికి ముప్పయ్యారు దాటలేదని తేలింది. సాక్షాత్తూ జనరల్ మేనేజరుగారి సంతకంతో నాకు ఛార్జిషీటు వచ్చింది.

వెంటనే ఆయనదగ్గిరకెళ్ళి మొరెట్టుకున్నాను "అయ్యా నేను ఈ ఆఫీసులో ఒక చిన్న ఉద్యోగస్తుణ్ణి. డ్యూటీ చేసుకుంటూనే తమ వంటి పెద్దలు ఏదైనా పని చెప్తే చేసుకుంటూ పోవడం నాకు విధాయకం. ఒక్క నెల రోజులపాటు నాకు ఎవ్వరూ ఏ విధమైన స్వంతపన్లూ వప్పగించకుండా చూడండిసార్, బకాయిలు మొత్తం వసూలు చేసి మీ కాళ్ల మీద పోస్తాను!" అన్నాను. "సరే, నేను కనుక్కుంటాను, నువ్వు లాబీలో కూర్చో" అని నన్ను పంపేశారు.

ఆయన వెంటనే ఇంటర్‌కమ్‌లో ఒకరొకర్నే పిల్చారు గావును, మళ్ళా పది నిమిషాల్లో కబురు పెట్టేరు.

"ఏమిటయ్యా నీ సాకులు? మీ ఆఫీసర్లందరి తోనూ మాట్లాడాను. ఎవరూ కూడా నీకు ఈ నెల మొత్తం మీద ఒక్కొక్క పూటకి మించి స్వంత పన్లు అప్పచెప్పలేదంటున్నారు. నువ్వేమో నెలంతా వాళ్ల పన్లు మీదనే తిరిగానంటున్నావు. ఇదేం బాగాలేదు. ఈసారికి వదిలేస్తానులే, గాని, ఇక మీదట బుద్ధిగా పని చేస్కో, పో!" అన్నారు జి.ఎం.గారు.

"థాంక్యు-సార్" అని దండం పెట్టాను, వెళ్ళబోతూ.

"అది సరే; అలా ఆగు! నీకు మనోహర్రావు అని ఓ ఫ్రెండున్నాడా?"

"ఫ్రెండు కాదండి. తోడల్లుడు."

"అదే. రైల్వే స్టేషన్‌లో చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ - ట కదా?"

"మరేండి."

"మా అల్లుడు రేపు గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి హైదరాబాద్ వెళ్ళాలయ్యా. ఇదుగో, టిక్కెట్టు, నువ్వు వెంటనే రైల్వే స్టేషను కెళ్లి ఒక బెర్తు కన్‌ఫర్మ్ చేయించుకొచ్చీ. డబ్బు రైల్లో టిటిఐ పుచ్చుకుంటారు గావును. అయినా ఎందుకైనా మంచిది, ఈ ట్వంటీ ఫైవ్ పట్టుకెళ్లు-" అంటూ పర్స్ తెరిచారు జి.ఎమ్.గారు.

శ్రీరామ రక్ష: వెయ్యేళ్ల ఆయుష్షు!

★